
# నవ్వుతూ నమస్కారం



కొవిలిపాటి విజయలక్ష్మి

నవ్వుతూ నమస్కారమన్నాడతను. నాకు ఒళ్ళు మండిపోయింది, పది నిముషాలు మా తమ్ముడింటి దగ్గర మమ్మల్ని దింపి వెళ్ళమని వేన్ డ్రయివరుకి చెప్పలేదూ! అతనికి తెలుసు అమ్మాయి నిల్చోలేక పోతూందనీ, నడవ లేదనీను, దాని జబ్బు బాధా కూడా అతనికి తెలుసు. అయినా ఎందుకు—అతనో డాక్టరయి ఉండీ హృదయం లేని మనిషి. నాకు అసహ్యమనిపించింది కాని సభ్యత తెలిసిన నా చేతులు ప్రతి నమస్కారం చేశాయి. నా ెదవులూ విచ్చుకున్నాయి చిరునవ్వుతో.

అతనెందుకు నవ్వాడో ఆదే రకం నవ్వో నాకు తెలియదు కాని నానవ్వు మాత్రం ఛీ, నువ్వో మనిషివా! అనే నవ్వు.

మెటడర్ రయ్యిన నాప్రక్కనుంచి వెళ్ళిపోయింది. ప్రస్తుత కర్తవ్యం గురించి ఆలోచించాను. ఆటో అయితే కుదుపు. అమ్మాయి కూర్చోలేదు, రిక్షా అయితే నెమ్మదిగా తీసుకు వెళ్తాడు. అనుకుంటూడిస్పెన్సరీపైపునడిచాను.

అమ్మాయికి బాగాలేదు. కాళ్ళుపట్టేశాయి. నడవలేకపోతూంది. మా ఊర్లో ఉన్న ముగ్గురు లేడీ డాక్టర్ల వైద్యం అయింది. కాని రోగం నయంకాలేదు. విశాఖపట్నం తీసుకుపొండి. ప్రతివారూ ఇచ్చే సలహా అదే-ఎక్కువన్లు-వేన్‌లు దొరకటం కష్టం-పరిచయమున్నవారూ, ఒకరిద్దరు కార్లున్నవారూ అందరూ పెదవి విరిచి లాభం లేదండీ ఇప్పుడు దొరకటం కష్టం అనే వారే.

ఎలాఐతేనేం! మెటాడర్ విశాఖపట్నానికి మాట్లాడేశు "ఎనభై రూపాయలకు-ఎనభై రూపాయలు ఓనరుకు, డ్రైవరుకి పదిరూపాయలూ ఇవ్వండి" అని నాకుచెప్పాడు "సరే ఏం చేస్తాం" అన్నాను. మామూలు పరిస్థితుల్లోఅయితే విశాఖపట్నానికి ముప్ఫయిరూపాయలే పుచ్చుకొంటారు వేన్‌కి. సాయింత్రం ఆరున్నర ప్రాంతాన్న ఆ డొక్కు మెటాడర్ మా గుమ్మం ముందు ఆగింది డ్రయివరు చిరచిరలాడుతూ బేగరండి అని తొందర చేశాడు. అమ్మాయిని పాయంపట్టి, చిరిగిపోయి గాటలు ఉన్న సీటుమీద దుప్పటి పరచి పడుకోబెట్టాము. నేనూ మా రెండవ అబ్బాయి వెనక సీట్లలో సర్దుకున్నాము. బయలుదేరింది మెటాడర్. గుర్రపుబండికన్నా కనాకష్టం. ఒకటే కుదుపు "ఇదేమిట్రా ఇలాంటి వేన్ మాట్లాడేవు!" అని మా చిన్నాడితో అంటే "ఉష్.... ఇదిదొరకటమే కష్టమయింది" అన్నాడు ఏమీ అనకు డ్రయివరు వింటే మననిక్కడ దించెయ్యగలడన్నట్లు హెచ్చరిస్తూ.

మౌనంగా ఉండిపోయాను. ఒళ్ళు హూనమైపోతుంది. నడిచిపోతే విశాఖపట్నానికి ఎంత టైము తీసుకుంటుందీ అని ఆలోచిస్తున్నాను.

మెయిన్‌రోడ్డులో సడన్‌గా ఆగింది మెటాడర్. ఫుల్‌సూటులో ఉన్న ఓ వ్యక్తి ఫ్రెంట్ సీట్లో కూర్చున్నాడు.

ఎవరు? అని ప్రశ్నిస్తూన్నట్లు మా చిన్న బ్బాయివైపు చూశాను.

అతనికి మెటాడర్‌లో షేరుంది. నెమ్మదిగా చెప్పాడు మావాడు.

సరి నేనింక విశాఖపట్నం చేరేవరకూ ఏమీ మాట్లాడలేదు. అమ్మాయి మూలుగుతూంది. మెటాడర్ వళ్ళుపచ్చడి చేస్తూంది. అక్కడ నర్సింగ్‌హోమ్‌లో డాక్టరుఉందా! ఎటయినా వెళ్ళిపోయిందా! అమ్మాయికి ఏం జబ్బని చెబుతుంది? హాస్పిటల్లో జాయిను చెయ్యమంటుందా, కెజిహెచ్‌కి తీసుకుపొమ్మంటుందా? అలా అయితే నేను ఎవరింట్లో మకాం పెట్టాలి? నాదగ్గర ఉన్న డబ్బు సరిపోతుందా! ఇలా ఆలోచిస్తున్నాను.

వేన్ కుదుపుకి అమ్మాయి మూలుగుతూంది. ఎలా అయితేనేం రాత్రి ఎనిమిది గంటలకి నర్సింగ్‌హోమ్ చేరుకున్నాం. చిత చిత చినుకులు....ఉక్క. మా అమ్మాయిని సాయంపట్టి మెల్లగా డాక్టరు దగ్గరకు చేర్చాం. ఆమె చెక్ చేసి, హాస్పిటల్లో ఉండనక్కర లేదని ప్రిస్క్రిప్షన్ వ్రాసిచ్చింది.

ముందు వేన్ కివ్వాల్సిన డబ్బు ఇవ్వమని తొందర పెడుతున్నాడు మావాడు, డ్రయివరు వాళ్ళు కాఫీలు తాగి వచ్చేశారట.

"చిన్నాన్నగారింటిదగ్గర మనని దించెయ్యమను" అని మధ్యవర్తి వేన్‌కివ్వమన్న అరవై రూపాయలూ వాడి చేతిలో పెడితే "ఎనభై ఇయ్యి కాదు మాటఇరవై ఇవ్వు" అన్నాడు వాడు. తెల్లబోయాను

"మనం వస్తున్నదీ ఆ కుదిర్చినాయన ఇవ్వమన్నదీ ఎనభయే కదా!" అన్నాను.

"కాదట మాట ఇరవై ఇవ్వమన్నారు. ఇచ్చెయ్యి!" అన్నాడు వాడు విసుగ్గా. బాగుంది అనుకుంటూ పర్సులో డబ్బు లెఖ్ఖపెట్టి ఇచ్చాను.

"మరో పదిహేను ఇవ్వు" అన్నాడు వాడు నా చేతిలో కాయితాలు అందుకుంటూ.

"ఎందుకూ!" అడిగాను

"బాగుండదు డాక్టరుగారు చెప్పారు ఇచ్చెయ్యండి" అన్నాడు

"డాక్టరెవర్రా!" అన్నాను కోపంగా.


"అతనికి షేరుందట మెటాడర్‌లో," అని అతని పేరు చెప్పాడు. అతని పేరు విన్నా కాని అతన్ని చూడలేదు సరే ఖర్మ ఖర్చు డబ్బుకి శని పట్టింది అనుకుని ఇచ్చేశాను.

వాడు గబగబా బయటికి వెళ్తుంటే "ఎక్కడుంది రా వేన్! బాబయ్యగారింటిముందు మనని దించి వెళ్ళిపొమ్మను" అన్నాను వాడి వెంట నాలుగడుగులు పడి.

"దించరట, వేన్‌కి టైముయిపోయిందట, వెళ్ళిపోవాలట" అంటూనే వెళ్ళిపోయాడు వాడు. "నేను అడుగుతాను" అంటూ వాడివెంట నడిచాను.

మావాడు లెక్కలు పెట్టి వాళ్ళకి డబ్బు ఇస్తున్నాడు.

"డ్రయివరుగారూ" అని గౌరవంగా పిలి



మా తమ్ముడిగారిల్లు మీరు వెళ్ళేతోవలోనే, దించి వెళ్ళిపోండి, అమ్మాయి పరిస్థితి చూశారుగదా!" అన్నానో, లేదో, కస్సుమన్నాడతను.. ఇప్పటికే గంట లేటయిపోయింది. ఐదు వందలు అడ్వాన్సుపుచ్చుకున్నాం డాక్టరు గారు చెప్పారని వచ్చాం కానీ లేకపోతే ...ం" అంటూనే ఇంజను స్టార్ట్ చేశాడు.

ముందు సీట్లో కూర్చున్న డాక్టరునవ్వుతూ "నమస్కారం" అన్నాడు.

మనస్సుమండిపోతుంటే పెదవుల్ని నవ్వు పులుముకొని ప్రతి నమస్కారం చేసేశాను. కాళ్ళీడ్చుకుంటూనర్సింగ్‌హోమ్‌పైకినడిచాను. మావాడు అంటున్నాడు "ఎలతను-ఎవరూ రాలేమన్నారు, బస్ స్టాండులో ఎంత తగువైపోయిందో తెలుసా!"

"నోరుముయ్యి. వెధవా! రాలేనని ఖచ్చితంగా చెప్పమన లేక పోయాడా! పైగా నల్భై రూపాయలు బేటానా. ఓ నాలుగు డబ్బులు అవసరం పడుతుందేమో అని తెచ్చుకున్నాంగనక సరిపోయింది—లేపోతే ఇప్పుడు వాడలా అడిగితే ఏమూతిలో దిగుతాం! వాడేం డాక్టరురా! బాబాయి ఇంట్లో మనని దింపే పది నిమిషాల టైముకి వాడికొంప మునిగిపోతుందా! మనిషి కాడూ! వాడికి మనసు లేదా." అరిచేశాను. "సరే, ఇప్పుడు ఏం చేద్దాం ఆలోచించండి" అన్నాడువాడు నా పనికిరాని కోపానికి నవ్వుకుంటూ.

ఆటోనా, రిక్షానా, ఎందులో తీసుకు వెళ్ళాలి? ఆటో అయితే కుదుపులు, రిక్షాలోనే బాగుంటుంది అనుకున్న నేను రోడ్డు పక్కన వరుసగా ఉన్న నాలుగు రిక్షాలవైపుచూశాను.

"రిక్షా కావాలాసార్, రమ్మంటారా బాబూ!" ఇద్దరు నావైపుచూశారు. రమ్మంటారా బాబూ అని అడిగిన నలభయి ఏభై సంవత్సరామధ్య వయసున్న వాణ్ణి చూసి, 'కావాలి!' అని మేం వెళ్లాల్సినఅడ్రసుచెప్పాను

అతను ఇంత కిరాయి అవుతుంది అన్నాడు.

నాకు న్యాయంగానే అడిగాడని పించి 'పద' అని డిస్పెన్సరీ వైపు నడిచాను.

మా అబ్బాయి "బస్సులో వస్తాను మీ రెళ్ళండి" అన్నాడు,

"మందులు అక్కడ దగ్గరలో ఉన్న షాపుల్లో కొన్నాం—ఒకరకం మాత్రలు మాత్రం దొరక లేదు ఎలాగా!" అన్నమాట బయటకే అన్నాను.

"రండిబాబు తోవలో మెడికల్ షాపులుంటాయి అడుగుదురుగాని" అన్నాడు రిక్షావాలా.

మందుల షాపుల దగ్గర రిక్షా ఆపుతానన్నాడు పాపం. అతనివైపు కృతజ్ఞతగా చూశాను, అమ్మాయి, నేనూ రిక్షాలోకూర్చున్నాం. "కూర్చోలేను నాన్నా" అంటూ ది.

అమ్మాయి రోగం చెప్పి "నీపేరేమిటోయ్" అని అడి ను.

"అప్పన్న" అన్నాడు.

రిక్షా నెమ్మదిగా కుదుపు లేకుండా సాగిపోతూంది.

"నీకు పిల్లలా! ఇల్లుందా?" అడిగాను.

"పిల్ల లేనండి. నలుగురూ సిన్నోళ్ళే-ఇల్లా," అని ఘొల్లున నవ్వి, "మాలోటోళ్ళకి ఇల్లేటి బాబూ, ఎల్లమ్మ పేటలో ఓ పాకలో అద్దె కున్నాం" అన్నాడు.

ఎంత అద్దె ఇస్తాడో అడిగాను. "ఇరవై, పంచన ఒండుకు తిని, వాకిట్లో పడుకొంటాం. వర్సమొస్తే ఉన్నాయి మాపాట్లు" అని మళ్ళీ నవ్వాడు.

"రిక్షా స్వంతమా"! అడిగాను.

"అద్దెదేనండి"

ప్చ్. పాపం అనుకున్నాను.

టక్కున రిక్షా ఆపి దిగి, మెడ, ముఖం,

భుజంమీద ఉన్న మాసిన తువ్వాలుతో తుడుచుకుంటూ, "అదిగో బాబు మెడికల్ షాపు మందేదో కావాలన్నారు అడగండి" అన్నాడు.

నేను మందు మాట మరిచేపోయాను. దిగి వెళ్ళి షాపులో ప్రిస్క్రిప్షనులో నాకు దొరకని మాత్రల పేరు చెప్పి అడిగాను—లేవన్నారు.

మరో షాపు, అలా మూడు షాపుల దగ్గర రిక్షా ఆపి వెళ్ళి కనుక్కోమన్నాడు అప్పన్న. పెద్ద పెద్ద చినుకులు పడటం ప్రారంభించాయి. అప్పన్న తలకి టోపీ తగిలించుకున్నాడు

"పోన్లే తీసుకు పోవోయ్, రేపొద్దున కొంటాను" అన్నాను నేను.

అల్లా సందులో ఓ షాపుంది. అక్కడ అన్ని మందులూ దొరుకుతాయి కాసింత దూరమే. కాని ఎల్దాం పదండి. అమ్మాయిగారు అంత బాధ పడుతున్నారు" అంటూ, దారి మళ్ళించాడు అప్పన్న.

సుమారు ఓ ఫర్లాంగు దూరం ఎక్కువ లాగాడేమో రిక్షా.

అతను అన్నట్లుగానే ఆషాపులో అన్ని మాత్రలు దొరికాయి. అతని మంచి తనానికి, మానవత్వానికి ముగ్ధుడనయ్యాను.

మా తమ్ముడి గారింటి ముందు రిక్షా ఆగింది. అమ్మాయిని రిక్షాలోనే ఉండమని వీధి తలుపు వేళ్ళతో తట్టి, పిలిచాను. "కాత్యాయనీ" అని, మా తమ్ముడు ఇంట్లో ఉన్నాడో లేదో అన్న అనుమానంతో. వాడు రాత్రిపూట నాలుగైదు ట్యూషన్లు ఇళ్ళకు వెళ్ళి చెబుతాడు.

"ఎవరూ!" అంటూ తలుపుతీసి చూస్తూ రోడ్డుమీద ఆగిన రిక్షావైపూ ఇబ్బందిగా ముఖం పెట్టి ఏమిటిలా వచ్చారు మమ్మల్ని ఉద్ధరించటానికా అన్నట్లు చూసింది కాత్యాయని.

"అమ్మాయికి కాస్త సుస్తీ చేసేనూ!! అని నసుగుతూ ఆమె పక్కనుంచి గదిలోకి అడుగు పెట్టి చేతిలో ఉన్న సంచి లోపల పెట్టి, రిక్షా వైపు నడుస్తూ "కాస్త ఇలారావమ్మా అమ్మాయిని తీసుకువద్దాం" అని ఆమెను పిలిచాను.

గత్యంతరం లేదన్నట్లు నా వెనుకవచ్చింది మరదలు. మా మాటలువిన్నపిల్లలు ముగ్గురూ బిలబిలా ఇవతలికివచ్చి "పెదనాన్న వచ్చారు, అక్క వచ్చింది." అంటూ సంబరంగా తప్పట్లు కొట్టారు. వాళ్ళకి నేను వచ్చానంటే సంతోషం. ఉన్న ఒకటి రెండు రోజులూ బిస్కెట్లు కొనిపెడతాను, వెళ్ళేప్పుడు సినిమా చూడండర్రా అని నాలుగో ఐదో, చేతిలో పెడతాను. "మళ్ళీ ఎప్పుడొస్తారు పెదనాన్నా" అని అడుగుతారు వాళ్ళు. మరదలు వాళ్ళవైపు కొరకొరా చూస్తుంది. "ఈ ఊరునుంచి పోవాలి బాబూ!" అని ఆమె సణగటం రెండు మూడు సార్లు విన్నాను కాని, వినీ విననట్లు ఊరుకున్నాను.

నిజమే మరి - ఆమె అనుకోవటంలో తప్పు లేదు. వాళ్ళకి వచ్చే ఐదారు వందల రూపాయలు చాలక తమ్ముడు ట్యూషన్లు చెబుతున్నాడు. పాలు, ఇంటి అద్దె కిరసనాయిలు అన్ని ధరలూ ఆకాశాన్నంటుకునే ఉంటాయి. మరదలు చాలా పొదుపరి, కాని ఏం లాభం. నెల పొడుగునా ఎవరెవరో చుట్టరికాలు కలుపుకొని, ఆఫీసుల పనులూ, ఆస్పత్రి తణిఖీలు, అంటూ వచ్చి తిని పోతూనే ఉంటారు. గోరుచుట్టుమీద రోకటి పోటులా అనిపిస్తుంది వాళ్ళ రాక-కాసీపడవలేక, నవ్వినట్లునవ్వుతూ పలకరించి ఆశ్రయ మిచ్చి, అన్నం పెడుతున్నారు వాళ్ళు. నాకూ అనిపిస్తుంది ఒక్కోసారి- వారి ఊరు నుంచి ఎటన్నా టాన్స్ఫరు చేయించుకు పోతే గాని బాగుపడరు అని....

లక్ష్మిని ఇంట్లోకి తీసుకువచ్చి, మంచంమీద పడుకోబెట్టిన తర్వాత రిక్షా అతనికి డబ్బులివ్వటానికి వీధిలోకి నడిచాను.

"రేపు మళ్ళీ ఆసుపత్రికి వెళ్ళుతారా బాబూ!" అడిగాడు రిక్షా అతను.

"ఆ....పదిగంటల ప్రాంతాన్న కనుపించు" అన్నాను.

అతని కివ్వాల్సిన రిక్షా అద్దె ఇచ్చేస్తూ, మరొక రూపాయి ఎక్కువ ఇచ్చాను.

"ఎందుకండి" అని నవ్వుతూనే తీసుకున్నాడు.

"ఒపిగ్గా మాబాధ అర్థం చేసుకుని మందుల షాపులకి తిప్పావు కదయ్యా!" అన్నాను.

"ఏదో మందు అరజంటుగా అవుసరమని తిప్పానుకాని నేనేం చదువుకున్నోణ్ణా బాబూ! మురగంలాంటి ఓణ్ని" అన్నాడు.

"చదువుకున్న మృగం కంటె నువ్వు వెయ్యిరెట్లు నయం. మనసు, హృదయం లేని చదువుకున్న మూర్ఖుడు కంటే కరిగే మనసు గ్రహించి చలించే హృదయం ఉన్న నువ్వు ఉత్తముడివి కదూ?" అన్నాను.

అతనికి నామాటలు అర్థమయేయో లేదో నవ్వుతూ నమస్కారం చేశాడు. నేనూ నవ్వుతూ ప్రతి నమస్కారం చేసేశాను.

డాక్టరు నవ్వుకీ ఇతని నవ్వుకీ ఎంత వ్యత్యాసం! అతని నవ్వు కృత్రిమపునవ్వు-మనిషి చదువు అనే చమ్కీ బురఖా తొడిగిన మనిషి నవ్వు! మనిషిని చూస్తూనే తానెవరో గుర్తుతెచ్చుకుని బిగుసుకు పోయే ప్రిస్టేజ్ లేదు. అందరి ఎదుటా ధైర్యంగా నిలువగలడు. హాయిగా నిద్రపోగలడు, అనుకున్నాను.

మా తమ్ముడు, నన్ను చూస్తూనే ఆత్రుతగా ఎన్నో ప్రశ్నలు వేశాడు. ఓపిగ్గా మా ఊరు నుంచి బయలుదేరినది మొదలు ఇప్పటి వరకూ జరిగినదంతా చెప్పాను.


మర్నాడు పదిగంటలయే సరికి అప్పన్న రిక్షా వీధి గుమ్మం దగ్గర ఆగింది.

నన్ను చూస్తూనే వాడు "నమస్కారం బాబూ! వస్తున్నారా!" అని ప్రశ్నించాడు.

"నీ దయవల్ల అమ్మాయిబాధ కాస్త తగ్గిందోయ్ "వస్తాం" అని అమ్మాయికి చెప్పాను రిక్షా వచ్చిందని.

"నా దయేటండీ-బగమంతుడి దయ. డాక్టరమ్మ మందూ" అన్నాడతను నవ్వుతూ. అతను నవ్వుతుంటే చిన్న వెల్తురులో చూసిన డాక్టరు ముఖం అతని నవ్వు గుర్తువచ్చి గుండెల్లో మండింది.

"చదువుకున్నావు — ఆమాత్రం మర్యాద తెలియదూ!" అంటారు కానీ, చదువు వేరు సంస్కారం వేరు అని - చదువుకున్న వారంతా సంస్కార వంతులు, మర్యాద తెలిసినవారూ కాదని ఎంత మందికి తెలుసు! ✻




## "నా పేరు అశ్రువు"

రేయింబవళ్ళలాంటి
రెండు గుండెల నడుమ
రేకులు తొడిగిన రేపటి ఆశ....
వర్షాల వర్షాలలో చిక్కి
అంతస్థుల పాదాలకింద రక్తం కక్కి—
అనువులను త్యజించినప్పుడు....
ఉన్నట్టుండి ఊపిరి పోసుకొని
కంటి యింటి ముందు కావలా ఉండే
రెప్పల గూర్ఖాలను తప్పించుకొని
చరచరా చెక్కిలిమీది కొచ్చాను నేను.
నా పేరు అశ్రువు
వియోగ వేదన ప్రసవించిన
వికృత వికలాంగ శిశువు.

వీరపల్లి వీణావాణి